క్లుప్తంగా

న్యాయం కావాలని నిరసన

చిత్తూరు అర్బన్: తమకు చెందాల్సిన ఆస్తిపై కోర్టులో కేసు నడుస్తుంటే దాన్ని తనఖా పెట్టి మున్సిపల్ షాపు రూమును అద్దెకు తీసుకోవడాన్ని నిరసిస్తూ యోగసాయి, అతని తల్లి కలసి శనివారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమకు చెందిన ఆస్తిని తమ అనుమతి లేకుండా కొందరు పేరు మార్చేశారని, దీనిపై న్యాయపోరాటం చేస్తున్నామన్నారు. కోర్టు పరిధిలో ఉన్న ఆస్తిని తనఖాపెట్టి శోభారాణి అనే మహిళ తన కుమార్తె పేరిట కార్పొరేషన్‌కు చెందిన ఎంఎస్ఆర్ కూడలిలోని షాపును వేలం పాటలో దక్కించుకున్నారన్నారు. దీనిపై కమిషనర్ కల్పించుకుని తమకు న్యాయం చేయాలన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసుల కుటుంబాలకు చిత్తూరు పోలీసుశాఖ రూ.2 లక్షల ఆర్థికసాయం అందించింది. శనివారం చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 19న పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తూ సూరిబాబు మృతిచెందగా, ఆయన సతీమణి సుజాతకు రూ.లక్ష, అదే నెల 27వ తేదీన వెదురుకుప్పం స్టేషన్‌లో పనిచేస్తూ మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్ సతీమణి హేమకు కార్పస్ ఫండ్ నుంచి ఈ మొత్తాన్ని అందజేశారు.

స్టోర్స్ పరిశీలన



మాట్లాడుతున్న ఎస్ఈలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్‌ను శనివారం తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ పరిశీలించారు. ఈసందర్భంగా స్టోర్స్‌లో నిల్వ ఉన్న మెటీరియల్ వివరాలను డీఈ బాలాజీని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వచ్చిన కండక్టర్ సీనియారిటీ ప్రకారం వాణిజ్య సర్వీసులకు ఇస్తున్నారన్నారు. తదుపరి కండక్టర్, ట్రాన్స్‌ఫార్మర్లు రావాల్సి ఉందని వచ్చాక వ్యవసాయ సర్వీసులకు వెంటనే ఇవ్వాలని ఎస్ఈలు ఆదేశించారు. స్టోర్ నిర్వహణ సక్రమంగా పెట్టుకోవాలన్నారు.

మహిళా చైతన్యంతోనే దేశాభివృద్ధి

తవణంపల్లె: మహిళల చైతన్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమని రాజమండ్రి సీనియర్ పిరమిడ్ మాస్టర్ శైలజ తెలిపారు. మండలంలో సంతపల్లె సమీపంలోవిఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో శనివారం మహిళా చైతన్యం కార్యక్రమంలో భాగంగా మూడు రోజులు పాటు ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఒక మహిళ అభివృద్ధి చెందితే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రం వ్యవస్థాపకులు, పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక, పిరమిడ్ మాస్టర్లు కేశవరాజ్, వెంకటేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.


స్కూటర్ ఢీకొని మహిళ మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు, గిరింపేటలోని కొలిమి వేదికకు చెందిన గాయత్రి (55), సాంబయ్య కండ్రిగ సమీపంలో ఉన్న ధ్యాన మందిరానికి వెళ్లారు. ధ్యానం పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లడానికి ఆటో కోసం రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన స్కూటర్ ఈమెను ఢీకొట్టింది. ఆమె తీవ్రంగా గాయపడడంతో స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గాయత్రి మృతిచెందింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాణిపాకంలో సినీ నటుడు సుహాస్

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ది వినాయక స్వామిని శనివారం సినీ నటుడు సుహాస్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి




అవగాహన కల్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

బంగారుపాళెం: మామిడిలో యాజమాన్య పద్ధతులు, సర్రక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. స్థానిక మామిడి మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం మామిడి సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. మామిడిలో తేనె మంచు, తామర పురుగులు, పండుఈగ, అంత్రాక్నోస్, బూడిద తెగుళ్ల ఆందోళనకు గురిచేస్తాయన్నారు. మామిడిలో కవర్లు కట్టడం ద్వారా మంచి దిగుబడి వస్తుందన్నారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, తిరుపతి నిమ్మ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త రంజిత్‌కుమార్, ఉద్యానశాఖ అధికారి సాగరిక పాల్గొన్నారు.

యువ గుండెకు పోటు!

- యుక్త వయసులోనే హృద్రోగాలు
- జిల్లాలో కేసుల తీవ్రత
- గ్రామాల్లోనూ పెరుగుతున్న రోగులు
- నివ్వెరపరుస్తున్న ఆరోగ్యశ్రీ గణాంకాలు
- జీవనశైలి మార్పులే కారణమంటున్న నిపుణులు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): పల్లె, పట్నం అనే తేడా లేకుండా యువతను గుండె జబ్బులు చుట్టుముడుతున్నాయి. హృద్రోగ చికిత్సలు పెరగ్గా, అత్యధిక కేసులు జిల్లాలో నమోదవుతున్నాయి. ఇందులో 15–35 ఏళ్ల బాధితులు 13 శాతం, 15–45 ఏళ్ల వారు 33.శాతం మంది ఉండడం గమనార్హం. అత్యవసర వైద్యసేవల నిర్వహణ, వైద్య నిపుణుల సంఘం గుర్తించింది. జీవనశైలి మార్పులే ఇందుకు కారణమని వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. కోవిడ్ వ్యాప్తి తరువాత ఈ కేసుల తీవ్రత జిల్లాలో తాండవిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మనిషి జీవనంలో శారీరక శ్రమ తగ్గిపోయింది. జంకు ఫుడ్ అలవాట్లు, ఒత్తిళ్లు పెరిగాయి. పర్యవసనంగా పాతికేళ్లలోపే మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం వంటి సమస్యలు చుట్టుముడుతున్నాయి. గ్రామాల్లోనూ ఇప్పుడు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. జీవనశైలిలో గ్రామీణానికి, నగరానికి మధ్యనున్న సన్నని గీత చెరిగిపోవడంతో పేద, దిగువ తరగతుల్లోనూ. గుండెపోటు బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఈ ఏడాది 108 వాహనాల్లో అత్యవసరంగా తరలించిన గుండెజబ్బు రోగులు మొత్తం 20,118 మంది. వీరిలో పల్లెవాసులు 49శాతం మంది. పాత జిల్లా ప్రకారం ఆరోగ్యశ్రీ గణాంకాలను పరిశీలించినా, నాలుగేళ్ల కాలంలో అందించిన హృద్రోగ చికిత్సలు, ఆపరేషన్లు 40వేలు ఉండవచ్చునన్ని అధికారులు చెబుతున్నారు. ఎక్కువమంది గ్రామీణ నిరుపేదలే కావడం ఆందోళన కలిగిస్తోంది.

యువతకు హృద్రోగ ముప్పు

నగర ప్రజల్లో జీవనశైలి మార్పు కారణంగా హృద్రోగ ముప్పు పెరుగుతున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. గుండె ఆరోగ్యంపై అవగాహనకు నిపుణులు అధ్యయనం చేశారు. 35–44 మధ్య వయస్సు స్త్రీ, పురుషుల నుంచి వారి వ్యాయామ ఆహార అలవాట్లు, కొవ్వు స్థాయి, శరీర ఎత్తు, బరువు నిష్పత్తి వివరాలను సేక రించారు. గుండె ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెరుగుతున్నా, తగిన చర్యలు తీసుకోవడంలో మాత్రం వారు నిర్లక్ష్యం చూపుతున్నట్లు అధ్యయనంలో తేలిందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- 76శాతం మంది ఉద్యోగ సంబంధ ఒత్తిళ్లకు గురవుతున్నారు.
- 80శాతం మంది కార్యాలయాల్లో అధిక సమయం పనిచేస్తున్నారు.
- 83శాతం మంది రుచికరమైన ఆహారాన్ని అతిగా తింటున్నారు.
- 74శాతం మందికి తగినంత నిద్ర ఉండడం లేదు.
- 81శాతం మంది మహిళలు ఇంటి పనులకే సమయమంతా కేటాయించాల్సి వస్తోంది. వీరిలో 66శాతం మంది అధిక కొలస్ట్రాల్ సమస్యను ఎదుర్కొంటున్నారు.

లక్షణాలను గుర్తించడమెలా?

- ఛాతి మధ్య పైభాగంలో నొప్పి
- ఛాతి నుంచి ఎడమ, కుడిచేతి, గొంతు వైపు నొప్పి వ్యాపించడం
- చెమటలు పట్టడం, ఆయాసం
- ఛాతి పట్టేసినట్లుగా, బరువుగా ఉండడం
- ఎసిడిటీని పోలిన లక్షణాలుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి

వీరికి అప్రమత్తత అవసరం..

- మధుమేహం, రక్తపోటు, కొవ్వులు అధికంగా ఉన్నవారు
- ధూమపానం చేసేవారు
- స్థూలకాయులు
- ఒత్తిడిని నిత్యం ఎదుర్కొనేవారు
- శారీరక శ్రమకు దూరంగా ఉండేవారు.
- కుటుంబంలో గుండెజబ్బు చరిత్ర ఉన్నవారు ఇలాంటి వారు 30 ఏళ్ల వయసులోనూ ఏడాదికో సారి గుండె పరీక్షలు చేయించుకోవాలి.

మనచేతుల్లోనే గుండె భద్రం...



హృద్రోగాలతో బాధపడుతున్న యువతలో శస్త్రచికిత్సలూ అధికంగానే నమోదవుతున్నాయి. ఇందులో 30శాతం రక్తనాళాల్లో పూడికలకు సంబంధించినవే. అందుకే యువ హృదయాలను సంరక్షించుకోవాలి. బాల్యం నుంచే నడకను అలవాటుగా చేసుకుంటే గుండెపోటు ముప్పు తగ్గు తుంది. చాలామంది పిల్లలు బడులకు నడిచి వెళ్లడంలేదు. ఆటలూ లేవు. దీంతో యుక్త వయసు వచ్చేసరికి అధిక బరువుతో బాధపడుతున్నారు. తర్వాత మధుమేహం, అధిక రక్తపోటు ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చేస్తున్నాయి.

–డాక్టర్ శ్రీకాంత్, గుండె వైద్యనిపుణులు, చిత్తూరు

కిశోర బాలికలకు భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీధర్

బంగారుపాళెం: కిశోర బాలికల భద్రతకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ భవనంలో శనివారం కిశోర బాలికా వికాసం కార్యక్రమంపై బంగారుపాళెం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ బాలికల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఐసీడీఎస్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌వెంగల్‌రాయన్, ఎంఈవో నాగేశ్వర్‌రావు,సీడీపీవో వాణిశ్రీదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు



పైమాఘంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఇంటి ముంగిటకే పేదలకు వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారులు డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని పైమాఘం, టి.పుత్తూరులో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం రచ్చరచ్చ

- ప్రజాసమస్యలు చర్చకు రాని వైనం
- మేయర్, కార్పొరేటర్ మధ్య వాగ్వాదం
- ఎమ్మెల్యే కల్పించుకున్నా వెనక్కి తగ్గని టీడీపీ కార్పొరేటర్



మేయర్ అముద, కార్పొరేటర్ ఇందు మధ్య వాగ్వాదం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పాలక వర్గ సర్వసభ్య సమావేశం రచ్చరచ్చగా ముగిసింది. అధికార పార్టీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయిలో జరిగింది. ఓవైపు ఎమ్మెల్యే, మరోవైపు మేయర్ కల్పించుకున్నా పరిస్థితి అదుపులోకి రాలేదు. మూడు గంట పాటు జరిగిన సమావేశంలో ప్రజాసమస్యలు ప్రస్తావించకుండా కేవలం ఒకరిద్దరు వాదులాడుకోవడానికేనా అంటూ మిగిలిన కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అముద అధ్యక్షత కౌన్సిల్ సమావేశం నిర్వహించగా, ఎక్స్–అఫిషియో సభ్యుని హోదాలో చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్‌నాయుడు హాజరయ్యారు. కార్పొరేషన్‌కు సంబంధించిన వాణిజ్య సముదాయాల్లో పలు దుకాణాలు ఖాళీగా ఉండడంతో ఇటీవల వేలం పాటలో పాల్గొని దక్కించుకున్నారు. మొత్తం 33 దుకాణాలను వేలంలో పాడుకున్న వాళ్లకు ఇవ్వడానికి కౌన్సిల్ ఆమోదం కోసం అజెండాలో రూపొందించారు. దీనిపై టీడీపీ కార్పొరేటర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓ వ్యక్తి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో, కోర్టులో నడుస్తున్న ఆస్తిని తనఖాపెట్టి దుకాణం దక్కించుకోవడానికి ప్రయతి్నంచారన్నారు. దీన్ని ఆమోదించడానికి వీల్లేదన్నారు. ఎమ్మెల్యే కల్పించుకుని తరువాత దీనిపై చర్చిస్తామన్నారు. అలాగే ఎంఎస్ఆర్ కూడలి వద్ద కమలహాసన్ అనే వ్యక్తికి మున్సిపల్ స్థలాన్ని ఇప్పటికే ఎనిమిదేళ్ల లీజుకు ఇవ్వగా, మళ్లీ మరో మూడేళ్ల లీజుకు ఇచ్చే విషయాన్ని అజెండాలో ఉంచారు. దీనిపై మరో కార్పొరేటర్ సుష్మ, ఇందు, అలీ అభ్యంతరం వ్యక్తం చేశారు. షాపు రూము ఇవ్వడాన్ని పెండింగ్ పెట్టి, స్థలాన్ని లీజుకు ఇవ్వడాన్ని ఆమోదించాలని, సమస్య ఉంటే తాను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ దశలో కార్పొరేటర్ ఇందు ఒక్కసారి కౌన్సిల్‌లో ఆమోదిస్తే, న్యాయపరమైన చిక్కులు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే, మేయర్ కల్పించుకున్నా పరిస్థితి సద్దుమణగలేదు. ఇలాగే చేస్తే బయటకు పంపాల్సి వస్తుందని మేయర్ అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జనసేన కార్పొరేటర్ శ్రీకాంత్ సైతం ఇందుపై ఫైర్ అయ్యారు. కౌన్సిల్ సమావేశంలో బయటి వ్యక్తులు దర్జాగా కూర్చుని, సభ మధ్యలోనే సభ్యులకు సలహాలు ఇవ్వడం, టీడీపీ మాజీ కార్పొరేటర్ల పతులు కొందరు సభలోకి వచ్చి మేయర్ అనుమతి లేకుండా కార్పొరేటర్లకు ఉచిత సలహాలు ఇవ్వడం కనిపించింది. రెండు గంటలకు పైగా వాగ్వాదాలతోనే సమావేశాన్ని జరిపించేశారు.

చివర్లో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వన్‌టౌన్ స్టేషన్ పక్కన బస్ షెల్టర్ ఏర్పాటు, కార్పొరేటర్లకు పత్రికలు పంపించడం, రోడ్డు విస్తరణ చేపడితే బాధితులకు పరిహారం ఇవ్వాలని ప్రస్తావించారు. మరో కార్పొరేటర్ హరిణిరెడ్డి మాట్లాడుతూ చెంగ్రాయనిమిట్టలో జరుగుతున్న కాలువ నిర్మాణాలు సక్రమంగా లేవని, కట్టమంచి–మైదా ఫ్యాక్టరీ రోడ్డును పునరుద్ధరించాలన్నారు. కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి మాట్లాడుతూ మెసానిక్ మైదానం రోడ్డులో రైల్వేక్రాసింగ్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మామిడి ఫలంకు పట్టుపడదాం



సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధన్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి ఫలం కోసం రైతులు, వ్యాపారులు, పరిశ్రమ దారులు పట్టుదలతో కృషి చేయాలని ఆలిండియా ఫుడ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ సౌత్ జోన్ చైర్మన్ కట్టమంచి గోవర్ధన్ బాబి తెలిపారు. చిత్తూరు నగరంలోని మ్యాంగో భవన్‌లో శనివారం కన్సార్టియం ఆఫ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆధ్వర్యంలో రాబోయే మామిడి పంటపై చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్) సభ్యులు, గుజ్జు పరిశ్రమ యజమానులు, ఉద్యాన శాఖ, ఆత్మ, మార్కెటింగ్ శాఖ అధికారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మార్కెటింగ్ సదుపాయాలు, సాగు ఖర్చులు తగ్గించడం, సస్యరక్షణ, నీటి యాజమాన్య పద్ధతులు, గుజ్జు పరిశ్రమల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గుజ్జు పరిశ్రమలో రైతులకు, ఎఫ్‌పీవో సంస్థలకు మామిడి సప్లయి, నగదు పంపిణీలో ప్రాముఖ్యత ఇవ్వాలని పలువురు నివేదించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ తమ ఇళ్లల్లో జరిగే శుభకార్యాలకు మామిడి జ్యూస్ వాడాలన్నారు. దేశీయ మార్కెట్లో మామిడి ఉత్పత్తుల వినియోగం, ప్రజలకు పళ్ల రసాలపై అవగాహన కల్పించాలన్నారు. యజమానులు శివకుమార్, తలపులపల్లి బాబురెడ్డి, బాలాజీ చంద్ర, చంద్రమోహన్, శ్రీధర్, చంద్రబాబు, సీఎఫ్ పీవో కార్యదర్శి ఆనంద నాయుడు, ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, మార్కెటింగ్ అధికారి పరమేశ్వరన్, ఏడీ ఆత్మ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కాణిపాకం: పూతలపట్టు మండలం పి.కొత్తకోటలో శుక్రవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో దొంగలు బంగారు నగలు, నగదు చోరీ చేశారు. స్థానికుల కథనం మేరకు.. పి.కొత్తకోటకు చెందిన విశ్వనాథం ఇంటికి తాళం వేసుకుని సొంత పనుల నిమిత్తం వేరొకచోటికి వెళ్లాడు. శుక్రవారం రాత్రి దుండగులు తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 3 సవర్ల బంగారం, కొంత నగదు చోరీ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. వీధుల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి దొంగలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

విద్యార్థుల ప్రవర్తనపై దృష్టి







బంగారుపాళెం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మురళీమోహన్, పి. కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, గిరింపేటలో జేసీ విద్యాధరి







కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, తవణంపల్లెలో.., సంతపేట ఉన్నత పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ



వెంగంపల్లె హైస్కూల్లో ముగ్గుల పోటీలు





సంజయ్‌గాంధీ నగర్ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న డీడీ రాజ్యలక్ష్మి, చిత్తూరులో ఎమ్మెల్యే

బంగారుపాళెం: విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంలోని పి.కొత్తకోట జెడ్పీ హైస్కూల్, బంగారుపాళెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమైనదని గుర్తుచేశారు. బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే భోజనం చేశారు. ఎంఈవోలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఎంపీడీవో శ్రీధర్, స్థానిక సర్పంచ్ ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

గుడిపాల: కమ్మతిమ్మాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌నాయుడువచ్చారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాల్లో అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశాలను ఉన్నతాధికారులు, పలు శాఖల అధికారులు పరిశీలించారు. నగరంలోని పీసీఆర్, కణ్ణన్ ప్రభుత్వ, సంతపేటలోని పీఎన్‌సీ నగరపాలక, లిటిల్ ఫ్లవర్ ఎయిడెడ్, గిరింపేట నగరపాలక ఉన్నత, సంజయ్‌గాంధీ నగర్‌లోని గిరిజన, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్ఓ మోహన్‌కుమార్, అడిషనల్ ఎస్పీ రాజశేఖరరాజు పాల్గొన్నారు. విద్యార్థులకు పలు అంశాలను వెల్లడించారు. సమావేశం అనంతరం తల్లిదండ్రులకు క్రీడాపోటీలు నిర్వహించారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో శనివారం మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి, జెడ్పీటీసీ భారతి, ఎంపీడీఓ రెడ్డిబాబు, తహసీల్దార్ సుధాకర్, ఎంఈవోలు హేమలత, త్యాగరాజులు రెడ్డి పాల్గొన్నారు.

బడుల్లో హడావుడి

- నియోజకవర్గ వ్యాప్తంగా పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశం
- ముఖం చాటేసిన తల్లిదండ్రులు
- ప్రొటోకాల్ ఉల్లంఘన
- కూటమి నేతలే కీలకంగా వ్యవహరించిన వైనం
- ప్రచార ఆర్భాటంగా సమావేశం..

ప్రభుత్వ బడుల్లో మళ్లీ దైన్యమైన పరిస్థితులు నెలకొన్నాయి. అభివృద్ధికి దూరమయ్యాయి. సమస్యలు పురుడు పోసుకుంటున్నాయి. ఉపాధ్యాయులు కరవుతున్నారు. పిల్లలకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందడం లేదు. భవిష్యత్తుపై భరోసా దూరమైంది. ఈ తరుణంలో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రచార ఆర్భాటానికి తల్లిదండ్రులు ముఖం చాటేశారు. దీనికితోడు విద్యాశాఖ అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారనే వాదనలు వినిపిస్తున్నాయి. –కాణిపాకం



బంగారుపాళెం: అతిథుల కోసం నిరీక్షిస్తున్న తల్లిదండ్రులు

పూతలపట్టు నియోజకవర్గంలో 297 ప్రాథమిక, 35 ప్రాథమికోన్నత, 42 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 17,975 మంది పిల్లలు చదువుతున్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో మొత్తం 328 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలున్నాయి. వీటిలో 205 ప్రాథమిక, 48 ప్రాథమికోన్నత, 80 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 90 వేల మంది విద్యార్థులున్నారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో పలు పాఠశాలల్లో విద్యా బోధన గాడి తప్పింది. కొంతమంది బడులకు సక్రమంగా రాకపోవడంతో పిల్లలు దారి తప్పుతున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించింది. దీన్ని రాజకీయాలకతీతంగా నిర్వహించేలా ఆదేశాలిచ్చింది. పిల్లల విద్యా ప్రగతి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరగాలని, రాజకీయాలు దరిచేరకుండా చూడాలని నిబంధన పెట్టారు. అలాగే శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య పటిష్టమైన బంధాన్ని ఏర్పరిచేలా చూడాలి. ఈ సమావేశం ద్వారా పిల్లల చదువు, ప్రవర్తన, క్రమశిక్షణ తదితర అంశాలను తల్లిదండ్రులు తెలుసుకోవాలి. పాఠశాలల అభివృద్ధితో పాటు నెలకొన్న సమస్యలు, విద్యాభివృద్ధిపై చర్చ జరపాలి. తల్లిదండ్రుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలి. బడి బాగుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలి. తరువాత సమావేశాలపై రాతపూర్వకంగా అభిప్రాయాలను తెలిపేందుకుగాను సూచనల పెట్టెను అందుబాటులో ఉంచాలి. చాలాచోట్ల తూతూ మంత్రంగా చేపట్టారు.

తల్లిదండ్రులు కరువు...

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి తల్లిదండ్రులు కరువయ్యారు. ప్రభుత్వ బడిలో చదివే పిల్లల తల్లిదండ్రులు అధిక శాతం దినసరి కూలీలు. వారం రోజుల శ్రమకు సంబంధించిన వేతనం శనివారం సాయంత్రం వారి చేతికి అందుతుంది. ఈ నేపథ్యంలో చాలా మంది సమావేశానికి హాజరు కాలేకపోయారు. ఇక ప్రభుత్వం ఆర్భాటం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిసి పలువురు తల్లిదండ్రులు పాఠశాలల వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో సమావేశాలు వెలవెలబోయాయి. పూతలపట్టు, బంగారుపాళ్యం, చిత్తూరు, గుడిపాల మండలాల్లో ముఖ్య అతిథుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. ఈ క్రమంలో కొంతమంది తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేసి సభ నుంచి తప్పుకున్నారు. చాలాచోట్ల పిల్లలతోనే కార్యక్రమాన్ని ముగించేశారు.

కానరాని ప్రొటోకాల్

పలు బడుల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ప్రొటోకాల్ ఉల్లంఘించారు. కూటమి నేతలకు పట్టం కట్టి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను కార్యక్రమానికి దూరం చేశారు. వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉపాధ్యాయులు పలువురు కూటమి నేతలు చెప్పిన విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు బడి సమస్యలను వదిలి ఈ ఆర్భాటం ఏమిటని, ముందు ఉపాధ్యాయులను గాడిన పెట్టి ప్రభుత్వ బడులను బాగు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.